IJCRT.ORG ISSN : 2320-2882

INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)

An International Open Access, Peer-reviewed, Refereed Journal

# అమ్మ భాషలో ఉపాధి అవకాశాలు

**డా. జి. వెంకట లాల్**

**తెలుగు ఉపన్యాసకులు**

**అఖిఖి ప్రభుత్వ కళాశాల**

**జంగారెడ్డి గూడెం**

**ఉపోద్ఘాతం:** ఒక సమాజం సంస్కృతి, చరిత్ర, సాహిత్యం, కళలు అన్నీ భాష పునాది మీదే నిలబడతాయి. ఒక జాతికి గుర్తింపునిచ్చేది భాష. మనిషిని జంతువులనుండి విడదీసి ప్రత్యేకంగా నిలిపేది భాష. భాష పుట్టిందే ప్రజల కోసం. భాష అర్థవంతమైన ధ్వనుల సమూహం. ఆదిమ మానవుడు ఒంటరిగా జీవించిన కాలంలో తన పరిమిత అవసరాలకోసం ధ్వనిసంకేతాలు సృష్టించుకున్నాడు. సమూహంలో జీవించడం మొదలుపెట్టాక ఆ ధ్వనులు సంకేత రూపం నుండి లిపి రూపం దాల్చడానికి కొంత కాలం పట్టింది. కాలక్రమంలో భాష అనేక విధాలుగా పరిణామం చెందింది. సృష్టిలో ఉన్న మానవ జాతుల్లో, ప్రతీ భాషకు ఒక ప్రత్యేకత, సౌందర్యం ఉంటుంది. ఎవరి భాష వారికి అమృత ప్రాయమే. మన తెలుగు భాష, తెలుగు జాతి ఇందుకు మినహాయింపు కాదు. ద్రావిడ భాష అయిన తెలుగు కూడా తెలుగువారికి మధురమే. తెలుగు భాషది యుగ యుగాల ప్రస్థానం. ఋగ్వేద కాలం నుండే ఈ భాషకు ఆనవాళ్లున్నాయి. కాలగతిలో ఎందరో పాలకులు, కవి పండితులు, భాషా ప్రేమికులు తెలుగు భాషామతల్లిని పోషించి పరిపుష్టం చేశారు. తెలుగు భాషలో కనిపించే తత్సమాలు, తత్భవాలు, అన్యదేశ్యాలు అలవోకగానో అవసరంగానో ఇమిడినవే.

వ్యక్తి సర్వతోముఖాభివృద్ధిలో మాతృభాష సంపూర్ణమైన పాత్ర పోషిస్తుంది. మాతృభాషలో పట్టు ఉన్నప్పుడే మనిషి విజ్ఞానవంతుడు కాగలడని ఎందరో మహానుభావులు ఎన్నోమార్లు చెప్పారు, వాళ్ళ జీవిత చరిత్రలు ఇదే విషయాన్ని నిరూపించాయి కూడా. అయినాకూడా తెలుగువారిలో మాతృభాష, పరాయిభాషల విషయంలో ఎన్నో భ్రమలు చోటుచేసుకున్నాయి. ఫలితంగా తెలుగు భాష అంతరించిపోయే భాషల్లో ఒకటిగా మారిందని దశాబ్దాలుగా విజ్ఞులు, భాషా పండితులు విలపిస్తూనే ఉన్నారు. ఈ భ్రమలు ఎంతదూరం వెళ్ళాయంటే మాతృభాష కంటే పరాయి భాషే ముద్దు అనేంతగా, పరాయి భాష నేర్చుకోకపోతే జీవితమే లేదనేంతగా. ఇందులో ఎవరిపాత్ర ఎంత అని ఒకరిపై ఒకరు నిందలు వేసుకునేకంటే తల్లిభాష విషయంలో కళ్ళకు కమ్మిన చీకటిపొరలు ఎలా తొలగించుకోవాలనే విషయం మీద తెలుగు వారందరూ దృష్టి పెట్టాల్సిన సమయమిది. ఉద్యోగం కోసమే చదువు అనే భావనలోనుండి, పేరు ప్రక్కన డిగ్రీలు ప్రదర్శించుకోడానికే విద్య అనే అజ్ఞానంలోనుండి బైటకు రావాలి. తెలుగులో చదివితే, తెలుగును చదివితే భవిష్యత్తు లేదనే మూర్ఖత్వం నుండి, అంధ విశ్వాసం నుండి తెలుగువారు ఎంత త్వరగా బైటకు వస్తే అంత మంచిది. ఆంగ్లం చదివితేనే, మాట్లాడితేనే ఉద్యోగం వస్తుందనే విషప్రచారం ఖండించాలి. అదే నిజమైతే పుట్టుక నుండి ఆంగ్ల భాష మాట్లాడే ఆంగ్లేయుల్లో నిరుద్యోగం ఎందుకుంది?

కేవలం శాస్త్ర, సాంకేతిక విద్యలను ఆంగ్లంలో చదివితేనే బిడ్డలు ఉన్నతోద్యోగాల్లో అధిక సంపాదనతో స్థిరపడతారనే అపోహ తల్లితండ్రుల్లో పోవాలి. తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా ఇలాంటి చదువులు పరాయి భాషలో చదివే విద్యార్థుల్లో ఎంతమంది ఆ స్థాయిలో స్థిరపడుతున్నారు?

ఏ భాషైనా వికసించాలంటే తల్లితండ్రులు, భాషా బోధకులు, విద్యార్థులు, ప్రభుత్వాలు, భాషా శాస్త్రజ్ఞులు, సమాజం... వీళ్ళందరూ ఎవరి పాత్ర వారు పోషించినప్పుడే అది జరుగుతుంది. తెలుగు భాషను సంస్కరించే పని ఇంటినుండే మొదలు కావాలని అందరూ గుర్తించాలి. ఒకప్రక్క తెలుగు రాష్ట్రాల్లో తెలుగువారు అమ్మభాషను ఉపయోగించలేని దుస్థితి మరోప్రక్క ప్రవాసాంధ్రులు తెలుగు భాషను అడుగడుగునా కాపాడుకుంటున్న వాతావరణం రెండూ ఏకకాలంలో జరుగుతున్నాయనే విషయాన్ని విస్మరించరాదు.

ఏ భాషైనా వర్తమాన అవసరాలకు తగినట్లుగా సంస్కరించబడాల్సిందే. ఆ పనిచేసే భాషా శాస్త్రవేత్తలను, ఆయా సంస్థలను తగిన విధంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. మాతృభాషను అధ్యయనం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలను భాషా బోధకులు విద్యార్థులకు శక్తివంతంగా వివరించగలగాలి. ఇవి తెలుసుకున్నప్పుడు అమ్మ భాషలో ఇన్ని ఉపాధి అవకాశాలున్నాయా అని ఆశ్చర్యం కలుగుతుంది.

**1. ప్రభుత్వ పాలనా రంగం:** తెలుగు రాష్ట్రాలు నిర్వహించే గ్రూప్-1, గ్రూప్-౹౹ మొదలైన అత్యున్నత పరిపాలనా సంబంధ ఉద్యోగాల్లో తెలుగును ఐచ్ఛికంగా ఎంచుకున్నవారెందరో విజయాలు సాధించారు. యూపిఎస్సి నిర్వహించే సివిల్ సర్వీసు పరీక్షల్లో కూడా తెలుగును ఎంచుకున్న విద్యార్థులు విజయ కేతనాలు ఎగురవేసి అత్యున్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. తల్లితండ్రులు తమ బిడ్డలను ఏ స్థాయిలో చూడాలనుకుంటారో అంతకు మించిన హోదా, సమాజంలో గౌరవం.. ఇవన్నీ వారికి మాతృభాష ప్రసాదించలేదా? ఈ ఉద్యోగాలకున్న మోజు ఆంగ్లవిద్యలో అభ్యసించి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో పనిచేసే వారిని సైతం ఆకర్షించేంతగా ఉందనడానికి ఎందరో అత్యున్నత స్థానాల్లో పనిచేస్తున్న అధికారులే నిదర్శనం. ఈ ఉద్యోగాలు కోరుకునేవారు తెలుగును ప్రత్యేకంగా ఎంచుకొని, శిక్షణ తీసుకొని తెలుగు భాషలో పరీక్ష రాసి విజయం పొందడానికి కారణం అమ్మ భాషలో చదివే పాఠాలు చక్కగా అర్థం కావడమే కాదు, మాతృభాషలో వ్యక్తీకరణ సామర్థ్యం గొప్పగా ఉండటమే. తెలుగు రాష్ట్రాలు నిర్వహించే ఇతర పోటీ పరీక్షల్లో కూడా తెలుగు భాషా సాహిత్యాలపై తప్పనిసరిగా ప్రశ్నలుంటాయి. ఇవి అభ్యర్థి విజయంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇటువంటి పరీక్షల్లో కేవలం తెలుగుభాషకు మాత్రమే ప్రాధాన్యమని, విద్యార్థులు కళాశాల స్థాయిలో ఎంచుకునే ఐచ్ఛికాలైన హిందీ, సంస్కృతాలు కాదని వారికి తెలియజేయాలి.

**2. బోధనా రంగం:** పాఠశాల స్థాయి నుండి విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం భాషోపాధ్యాయుల విధి. విద్యార్థుల అభిరుచిని బట్టి బోధనా రంగంవైపు వారిని మళ్లించవచ్చు. పాఠశాల మొదలుకొని విశ్వవిద్యాలయాల వరకు విద్యా సంస్థల్లో బోధకులుగానే కాదు, పోటీ పరీక్షలకు శిక్షణ అందించే శిక్షకులుగా కూడా రాణించవచ్చు.

**3. సృజనాత్మక రంగం:** ప్రత్యేకంగా భాషపై అభిరుచి కలిగి సృజనాత్మకత కలిగిన విద్యార్థులకు కథలు, కథానికలు, కవితలు, గేయాలు, పాటలు రాసే దిశగా ప్రోత్సహించవచ్చు. సమాజానికి పనికివచ్చే మంచి రచయితలుగా వాళ్ళను తయారుచేయొచ్చు. ఏ ఉద్యోగం లేకపోయినా హాయిగా చక్కని కథలు కూడా చెప్పుకొని బ్రతికే కాలంలో మనమున్నాం. తీరిక లేని ఆధునిక జీవనశైలి నగరాల్లో ఎందరో కథకులకు 'స్టోరీ టెల్లర్' పేరుతో ఉపాధిని కల్పిస్తూ ఉంది. తల్లిదండ్రులు పిల్లలతో సహా వారానికి ఒకసారి వచ్చి డబ్బులు కట్టి మరీ కథలు వింటున్నారు. ఇది కాలంలో వచ్చిన మార్పు. అందువల్ల విద్యార్థులకు తెలుగు భాషపై ప్రావీణ్యం పొందేలా కళాశాలల్లో అభివ్యక్తి నైపుణ్యాలుగా పిలవబడే వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం అనే నాలుగు అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. భాషలో పరిశోధన చేయాలనుకునేవారు, భాషా శాస్త్రజ్ఞులుగా ఎదగాలనుకునేవారు ఇంటర్మీడియట్, డిగ్రీలో తెలుగును ద్వితీయ భాషగా ఎంచుకొని భాషా శాస్త్రంలో పైచదువులు చదవొచ్చు. ఈ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగావకాశాలుంటాయని అధ్యాపకులు విద్యార్థులకు చెప్పగలగాలి.

వినోద రంగంలో రచయితలకు ఎంత ప్రాధాన్యం ఉందో అందరికీ తెలిసిందే. ముఖ్యంగా కళాశాల విద్యార్థులకు అభివ్యక్తీకరణ నైపుణ్యాలలో శిక్షణ వారికి డిగ్రీ పూర్తికాగానే ఉపాధిని కలిగిస్తుంది. గాత్ర శుద్ధి ఉన్నవాళ్ళు గాయకులుగా ఎదగవచ్చు. భావానికి తగిన అభినయం చూపగలిగితే నటులుగా ఎదగొచ్చు. వీటన్నింటికీ భాష కావాలి. ఈ అవసరాన్ని గుర్తించి ప్రత్యేకంగా అభివ్యక్తి నైపుణ్యాలు, సృజనాత్మక రచన, పత్రికా రచన, ప్రసార మాధ్యమాలపై పాఠ్యాంశాలను డిగ్రీ తెలుగులో చేర్చడం సంతోషకరం. తెలుగు భాషా సాహిత్యాలకు భాషాశాస్త్రాన్ని చేర్చి, చారిత్రక దృష్టి కోణంతో క్షుణ్ణంగా బోధించినప్పుడే విద్యార్థిలో భాషకు సంబంధించిన సంపూర్ణ జ్ఞానం వికసిస్తుంది. వర్తమానానికి పునాది నిన్నటి చరిత్రే. భాష కూడా ఇందులో భాగమే. వీటిని తెలుసుకుని అవసరానికి తగినట్లుగా భాషా సాహిత్యాలను ఉపయోగించుకునే విధానం విద్యార్థులకు తెలియజెప్పాలి. చిన్నప్పుడు పెద్దల, గురువుల నియంత్రణలో ఉన్నప్పుడు పిల్లవాడు వరుస క్రమంలో నిలబడి బస్సెక్కాలని నేర్చుకుని పాటించి, యుక్త వయసు రాగానే ఆ నేర్చుకున్న విలువలను ఎందుకు వదిలేస్తున్నాడు? అనే ప్రశ్నకు సమాధానం వెతకాలి. వదిలేస్తే ఏదైనా జారిపోతుంది. భాష కూడా అంతే. విద్యార్థికి తన బాగు కోరే ప్రతీ ఒక్కరి అవసరం ఉంది అని గుర్తించాలి. వాళ్ళను సరైన దిశలో ప్రోత్సహించడం అందరి బాధ్యతైనప్పటికీ ముఖ్యంగా భాషా సాహిత్యాలను బోధించే అధ్యాపకులదే ఇందులో ప్రధాన పాత్ర.

**<u>4. పత్రిక, ప్రసార రంగాలు:</u>** ఈరోజుల్లో సమాచార వ్యవస్థకున్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. పత్రికల పరిశీలన, పత్రికా భాష, పత్రికా రచన, శైలి, సంపాదకీయ రచన, లేఖా రచన వంటి అంశాలను కళాశాల స్థాయిలో విద్యార్థులు అధ్యయనం చేయడం వలన వారి అభిరుచిని అనుసరించి పత్రికా రంగంలో వార్తా విలేఖర్లుగా, సంపాదకులుగా, ఉప సంపాదకులుగా ఉపాధి అవకాశాలు పొందవచ్చు.

ప్రసార మాధ్యమాలకు సంబంధించి రేడియో రచన, నాటికలు, టెలివిజన్ రచన, యాంకరింగ్ వంటి అంశాలలో రచయితలుగా, వ్యాఖ్యాతలుగా ఉపాధి మార్గాలు పెంపొందించుకోవచ్చు. అత్యాధునికమైన యూట్యూబ్, ఫేస్బుక్, ట్విట్టర్, బ్లాగ్, వాట్సప్ వంటివి విద్యార్థులకు ఎంతో ప్రయోజనాత్మకాలుగా మరే విధానాన్ని వాళ్ళకు తెలియజేయాలి. కళాశాలల్లో చదివే విద్యార్థులు వాట్సప్ లో తెలుగు సందేశాలను ఎక్కువగా ఇంగ్లిష్ భాషలో పంపుతూ ఉంటారు. ఇలాంటి సందర్భాల్లో తెలుగు ఫాంట్స్ విద్యార్థులు విస్తృతంగా ఉపయోగించేలా తగిన అవగాహన అధ్యాపకులు కలిగించాలి. విద్యార్థులు స్మార్ట్ ఫోన్ వాడకంలో చురుగ్గా ఉంటారు కాబట్టి వారిచేత తెలుగు భాషలో పాఠ్యాంశాలకు సంబంధించిన తక్కువ నిడివిగల పాడ్ కాస్ట్, ఇతర యూట్యూబ్ వీడియోలు తయారుచేయించడంద్వారా వారిని ప్రోత్సహించవచ్చు. 'వార్త యందు జగము వర్తిల్లుచున్నది' అని నన్నయ మహాకవి ఆనాడే చెప్పాడు. నిరంతరం వార్తలందించే ప్రసార రంగాల్లో ఉద్యోగావకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకునేలా చేయాల్సిన బాధ్యత కళాశాల స్థాయిలో జరగాలి. సృజనాత్మక నైపుణ్యాలు, ప్రసార సాధనాల్లో ఉద్యోగావకాశాలు, వాణిజ్య ప్రకటనల నిర్మాణంపై కార్యశాలలు ఏర్పాటు చేయడం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరం. పై అంశాలకు సంబంధించి విద్యార్థులు తమ అభిరుచికి తగినట్లుగా వాటిని వృత్తులుగా, ప్రవృత్తులుగా మలుచుకోవచ్చు. ఇవన్నీ తెలుగుతో డిగ్రీ చదివిన వారికి అందుబాటులో ఉద్యోగావకాశాలే.

**<u>5. అనువాద రంగం:</u>** కళాశాల స్థాయిలో విద్యార్థి మాతృభాష, ఒక పరాయి భాషలో పట్టు సాధించగలిగితే అనువాదరంగంలో కూడా విస్తృత అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు. మన భాషలో ఉండే ఉత్తమ సాహిత్యాన్ని ఇతర భాషల్లో అందించవచ్చు. ప్రభుత్వ కార్యాలయాల్లో, న్యాయస్థానాల్లో, విదేశాంగ రాయబార కార్యాలయాల్లో, పత్రికా రంగంలో, వినోద రంగంలో, రాజకీయ రంగంలో కూడా అనువాదకులుగా, కంటెంట్ రైటర్లుగా, డబ్బింగ్ ఆర్టిస్టులుగా ఎదగొచ్చు. చరిత్ర మీద అభిమానం ఉన్నవారు పురావస్తు శాఖ, టూరిజం రంగంలో కూడా రాణించవచ్చు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పనిచేసే ఉద్యోగులకు భాషా నిపుణుల సహాయం తప్పనిసరి. అలెక్సా వంటి వాటికోసం భాషా నిపుణులు కావాలి. ఈ రంగాల్లో భాషానువాదకులకు విదేశాల్లో మంచి అవకాశాలున్నాయి. టైప్ క్రాఫ్ట్ టూల్ ద్వారా వివిధ తెలుగు పదాలు నిక్షిప్తం చేయడానికి భాషా పండితులు కావాలి.

**6. సాఫ్ట్వేర్ రంగం:** తెలుగు చదివిన విద్యార్థులకు సాఫ్ట్వేర్ ఉద్యోగాలు అందని ద్రాక్ష అనేది ఒకప్పటిమాట. ఇప్పుడు డాటా అనలిస్ట్, లాంగ్వేజ్ అనలిస్ట్, లింగ్విస్ట్, కంప్యూటేషన్ లింగ్విస్టులుగా మాతృభాషకు సంబంధించిన ఉద్యోగాలు ప్రసిద్ధ సాఫ్ట్వేర్ సంస్థలు దేశ విదేశాల్లో అందిస్తున్నాయి. సాఫ్ట్వేర్ కంపెనీలు కూడా అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసేప్పుడు సృజనాత్మక రంగం, లలిత కళల్లో ప్రవేశం, ప్రావీణ్యం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడం చూస్తూనే ఉన్నాం కదా.

కళాశాల స్థాయిలో విద్యార్థులు తెలుగు టైపింగ్, తెలుగు డిటిపి వర్క్, ఫోటోషాప్ వంటి కోర్సులు నేర్చుకుంటే అదికూడా వారికి ఉపాధినిస్తుంది. చదువుకుంటూనే పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేసుకోవచ్చు. కళాశాలల్లో కంప్యూటర్ పరిజ్ఞానం లేని, ఖఅఖ టూల్స్ వాడలేని భాషా బోధకులు తెలుగు టైపింగ్, పాఠ్యాంశాలకు సంబంధించిన యూట్యూబ్ వీడియోలు, ఆడియోల తయారీ, పోస్టర్ డిజైనింగ్, పీపీటీల తయారీ వంటి విషయాల్లో విద్యార్థులపై ఆధారపడటం తెలిసిందే. అందువల్ల ఇటువంటి విషయాల్లో ఆధునిక పరిజ్ఞానాన్ని గురువులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలి. తల్లిభాషకు సంబంధించిన పార్ట్ టైమ్ ఉద్యోగాలపై విద్యార్థులకు వీలైనంత అవగాహన కలిగించాలి.

**7. భాషతో ఉపాధి:** పలు వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేయడానికి ప్రాంతీయ భాషలను ప్రోత్సహిస్తున్నాయి. మార్కెట్లలో వాళ్ళు ఉత్పత్తి చేసే వస్తువులకు సంబంధించిన సమాచారం మనదేశంలో ప్రాంతీయ భాషల్లో సామాన్యులకు అందించడం ద్వారా వారి అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. వ్యాపార సంస్థలు భాషతో చేసే ఈ వ్యాపారం మాతృ భాషలో పట్టు కలిగిన యువతకు ఉపాధినిస్తుందనే విషయం గుర్తించాలి.

పైతాన్, డాటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్ వంటి ఆదరణ కలిగిన కోర్సులు కూడా ప్రాంతీయ భాషల్లో బోధించబడుతున్నాయి. వీటికి సంబంధించిన ఉద్యోగాల్లో భాషా నిపుణుల సహాయం తప్పనిసరి. కాబట్టి కళాశాల స్థాయిలో ఈ కోర్సు ఎంచుకున్నా, విద్యార్థులు తల్లి భాషను నిర్లక్ష్యం చేయడానికి వీల్లేదు. భాష వ్యాపారాత్మకమైన నాటినుండీ తెలుగు భాషా పరిజ్ఞానం కలవారి అవసరం అపరిమితంగా పెరిగింది. ఈ విషయాన్ని అందరూ గుర్తించి తగిన విధంగా చర్యలు చేపట్టాలి. అంతకంటే ముందు మనం మారడానికి సిద్ధంగా ఉండాలి.

న్యూస్ రైటర్, ప్రూఫ్ రీడర్, ఎడ్యుకేషన్ కౌన్సిలర్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, హ్యూమన్ రిసోర్స్ ఎగ్జిక్యూటివ్, బిజినెస్ డెవలప్మెంట్ అసోసియేట్, ఫ్లిప్ కార్ట్/అమెజాన్ వాయిస్ ప్రాసెస్, లాంగ్వేజ్ మేనేజర్, ఇంగ్లిష్ తెలుగు లాంగ్వేజ్ ఎక్స్పర్ట్, అడ్మిషన్ ఆఫీసర్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెలీ కాలర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ కేర్ అసోసియేటివ్, కస్టమర్ సపోర్ట్ అసోసియేటివ్, పొలిటికల్ రీసెర్చర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అక్కౌంట్స్ ఎగ్జిక్యూటివ్, కమ్యూనికేషన్స్ ఆఫీసర్, టెక్నికల్ కంటెంట్ రైటర్, కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్, రీజనల్ ఆపరేషన్స్ మేనేజర్, డేటా అనలిస్ట్, లాంగ్వేజ్ అనలిస్ట్ లాంటి ఉద్యోగాలు అన్నీ ప్రాంతీయ భాషలకు సంబంధించినవే. ఇటువంటి ఉపాధి అవకాశాలపై కళాశాల స్థాయిలో విద్యార్థులకు, తల్లితండ్రులకు విస్తృత అవగాహన కలిగించి తెలుగును చదివే దిశగా ప్రోత్సహించాలి. ప్రాంతీయ భాషల్లో సాంకేతికత వినియోగంపై కేంద్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. విద్యార్థులు స్వాయమ్ ఆన్లైన్ కోర్సులను కూడా తెలుగులో చదివే అవకాశం ఉంది. వీటిపై విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలి.

సాహిత్యాన్ని అధ్యయనం చేయడం వల్ల భాషా సంపత్తి పెరుగుతుంది. ఈ భాషను ఈనాటి అవసరాలకు అనుగుణంగా వాడాలి. ఎందుకంటే భాషతో వ్యాపారం చేసే గూగుల్ లాంటి సంస్థలకు భాషా సంపద కావాలి. తెలుగు భాషా పండితులు, ప్రేమికులు భాషా సంపదను గూగుల్ డాటాబేస్ లో నిక్షిప్తం చేయాలి. విద్యార్థులను ఇందులో భగస్వామ్యం చేయాలి. తద్వారా సామాజిక మధ్యమల్లో విరివిగా తెలుగు భాష వాడుకోవడానికి కావాల్సిన పదజాలం అందుబాటులోకి వస్తుంది. వికీలో వ్యాసాలు రాసే దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలి. భారతదేశంలో అన్నిచోట్లా జరిగే విషయాలు అంతర్జాతీయ సమాజానికి కావాలి. ఇక్కడ జరిగే విషయాలపై విదేశాల్లో పరిశోధనలు జరుగుతూ ఉంటాయి. విద్యార్థులు ప్రతిరోజూ వార్తా పత్రికల్లో వచ్చే రాజకీయ, ఆర్థిక, క్రీడల విషయాలను సేకరించి సంబంధిత వేదికల ద్వారా విదేశాలకు పంపుతూ ఉపాధిని పొందవచ్చు.

**ముగింపు:** ఇప్పుడు తల్లి భాష చచ్చిపోతుందని బాధపడేకంటే, పరాయి భాషను నిందించేకంటే, మన తెలుగు భాషలో ఉన్న ఉపాధి అవకాశాల గురించి ముఖ్యంగా కళాశాలల్లో చదివే విద్యార్థులకు అవగాహన కలిగించాల్సిన అవసరం భాషా బోధకులకే కాదు, తెలుగు వారందరికీ ఉంది. విద్యాసంస్థల్లో విద్యార్థులకు తెలుగు నేర్పించే బాధ్యత తెలుగు వారిదే అని, వాళ్ళకు తెలుగు రాకపోతే అందుకు బాధ్యుడు తెలుగు భాషా బోధకుడే అని నిందలు వేసే బదులు ఇతర సబ్జెక్టులు బోధించేవారు కూడా తెలుగువారేనని, వారు కూడా తెలుగులో మాట్లాడుతూ భాషను కాపాడాలని తెలుసుకోవాలి. తెలుగేకదా అన్న చిన్నచూపు, అశ్రద్ధ అటు విద్యార్థుల్లో, అధ్యాపకుల్లో, తల్లిదండ్రుల్లో, సమాజంలో కూడా ఉండకూడదు.

భాషను బోధించే అధ్యాపకులు భాషపట్ల అవగాహనతో, ప్రేమతో, బాధ్యతతో, సాహిత్యంపట్ల అభిరుచితో బోధించినప్పుడు విద్యార్థిలో మార్పు వస్తుంది. భాష పట్ల నిజాయితీ, నిబద్ధతలు అందరిలో ఉండాలి. తెలుగు భాష అంటే పద్యాలు, ఛందస్సు, వ్యాకరణం మాత్రమే అనే భావన తొలగాలి. పాఠ్యాంశాల నిర్మాణం పటిష్ఠంగా, సరళంగా, ఆసక్తికరంగా ఉండాలి. ముఖ్యంగా తెలుగు భాషను సాంకేతికంగా, ఈనాటి అవసరాలకు, ఉపాధి అవకాశాలకు ఏ విధంగా ఉపయోగించాలో తెలిపే పాఠ్యాంశాలు కావాలి. భాషకు సాంకేతికత జోడించడం ఎంత అవసరమో అందరూ గుర్తించాలి. భాషను బోధించే అధ్యాపకులు కూడా సాంకేతిక ఉపకరణాల సహాయంతో భాషా సాహిత్యాల్లో ఎంతో పరిశోధన చేయవచ్చనే విషయాన్ని గుర్తించాలి. భాష విషయంలో మారాల్సిన మన ధోరణి ముందు ఇంటి నుండే మొదలు కావాలి.